క్లుప్తంగా

మహిళా వర్సిటీతో కలిసి పరిశోధనలు



మొహ్మద్ అరిఫుల్లాను సత్కరిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి ఎడ్యుకేషన్: శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీతో కలిసి పరిశోధనలు చేపట్టనున్నట్లు మలేషియాలోని క్యాలంటున్ యూనివర్సిటీ ప్రొఫెసర్ మొహ్మద్ అరిఫుల్లా తెలిపారు. మహిళా వర్సిటీ ప్లేస్‌మెంట్ అండ్ కెరీర్ కౌన్సెలింగ్ సెల్, సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం వర్సిటీలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థినుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం ఆయన్ను వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ కె.రాజారెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.రజని సత్కరించారు.

వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి

తిరుపతి కల్చరల్: వ్యాధులపై మహిళలు అవగాహన కలిగి ఉంటూ తమతో పాటు తమ కుటుంబ ఆరోగ్య పరిరక్షణకు దోహదపడాలని రాస్ డైరెక్టర్ వి.నాగరాజు పిలుపునిచ్చారు. టాటా హాస్పిటల్ సహకారంతో పొదుపు సంఘాల సౌకర్యార్థం రాస్ ఆధ్వర్యంలో మంగళవారం దాసరి మఠంలో ఉచిత క్యాన్సర్ వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 150 మందికి క్యాన్సర్‌తో పాటు హెపటైటిస్, షుగర్, రక్తపోటు సంబంధించిన పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. టాటా ప్రాజెక్ట్ సిబ్బందితో పాటు రాస్ సిబ్బంది నాగేశ్వర్, మునిరాజు, నాగరత్న, ప్రమీలమ్మ, రుబీనా పాల్గొన్నారు.

యాత్రికులకు మజ్జిగ పంపిణీ

చంద్రగిరి(తిరుపతి రూరల్): పోలీస్ ట్రైనింగ్ కళాశాల(పీటీసీ)లో యాత్రికులు, పాదచారుల కోసం మంగళవారం చలివేంద్రం ప్రారంభించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ మునిరాజా మజ్జిగ పంపిణీ చేశారు.

వారసత్వ సంపదను కాపాడుకోవాలి

తిరుపతి రూరల్: చారిత్రక వైభవానికి ప్రతిరూపాలైన వారసత్వ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఏపీ టూరిజంశాఖ రీజనల్ డైరెక్టర్ రమణప్రసాద్ పిలుపునిచ్చారు. ప్రపంచ వారసత్వ దినోత్సవ సందర్భంగా భారత పురావస్తుశాఖ, ఆంధ్రప్రదేశ్ పర్యాటకశాఖ సంయుక్తగా చంద్రగిరిలోని రాయలవారికోట వద్ద వారసత్వ సదస్సును నిర్వహించారు. రాయలవారి కోట, శ్రీకృష్ణదేవరాయుల పాలన, నాటి వైభవం గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పురావస్తు శాఖ సీనియర్ కన్సర్వేషన్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్, ఎంఈఓ లలిత కుమారి పాల్గొన్నారు.

ఆటో బోల్తాపడి ఆరుగురికి గాయాలు

తిరుచానూరు (చంద్రగిరి): ఆటో అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ఆరుగురికి గాయాలైన ఘటన మంగళవారం ఓటేరు, అవిలాల మధ్య చోటుచేసుకుంది. బొప్పరాజుపట్టికి చెందిన మునిరత్నమ్మ, కృష్ణయ్య, సుగుణమ్మ, భారతి, గుర్రమ్మ, అమ్ములు తిరుచానూరు మామిడికాయల మండీ సమీపంలో ఉన్న హోటల్‌లో పనికి ఆటోలో వెళుతుండగా ఓటేరు సమీపంలో ఆటో డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ఆరుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను రుయా ఆస్పత్రికి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి గడపలోనూ లబ్ధిదారులే!

- ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి



పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం: తిరుపతిలో ఏ గడపకు వెళ్లినా జగనన్న అందించిన సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులే ఉన్నారని ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. తిరుపతి 21వ డివిజన్ ఎంఆర్‌పల్లి వెస్ట్‌చర్చ్ వద్ద కార్పొరేటర్ రాజేశ్వరమ్మ ఆధ్వర్యంలో మంగళవారం డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి నిర్వహించిన గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం పాల్గొని జగనన్న అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే ప్రజాసంక్షేమమే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలను అందిస్తూ పేదల గుండెల్లో స్థిరంగా నిలిచిపోయారన్నారు. దేశానికే జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని ఏ గడపలో చూసినా రూ.8లక్షల నుంచి రూ.12లక్షల వరకు లబ్ధి పొందిన వారే ఉన్నారన్నారు. పేదల కష్టాలు తెలిసిన జగనన్నలాంటి నాయకుడు శాశ్వత సీఎంగా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారని తెలిపారు. గత ప్రభుత్వాల్లో ఎన్నడూ జరగనంతగా నాలుగేళ్లల్లో తిరుపతి ఎంతో అభివృద్ధి చెందిందని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. తిరుపతి అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారన్నారని పేర్కొన్నారు. మాస్టర్‌ప్లాన్ రోడ్లతో తిరుపతిలో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టనున్నట్లు ఆయన తెలిపారు. కార్పొరేటర్ ఆరణి సంధ్య, కో–ఆప్షన్ సభ్యుడు షేక్ ఇమామ్, టౌన్‌బ్యాంక్ వైస్ చైర్మన్ వాసుయాదవ్, డైరెక్టర్లు అనీల్‌రాయల్, మాకం చంద్ర, నాయకులు వెంకటమునిరెడ్డి, తిమ్మారెడ్డి, కుమార్, రెడ్డిరాణి పాల్గొన్నారు.

ఈద్గాలో అన్ని వసతులు కల్పిస్తాం



ఈద్గా మైదానంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీషా

- ఈద్గా మైదానాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: రంజాన్ పండుగ పర్వదినాన ముస్లింలు నమాజ్ చేసుకునేందుకు వీలుగా ఈద్గా మైదానంలో అన్ని వసతులు కల్పిస్తామని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఎస్వీ యూనివర్సిటీ సమీపంలోని ఈద్గా మైదానంలో వసతుల ఏర్పాట్లపై ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, పార్టీ నగర అధ్యక్షుడు పాలగిరి ప్రతాప్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎస్‌కే బాబు మంగళవారం ముస్లింలతో కలిసి పర్యటించారు. ఈనెల 22న రంజాన్ రోజున ఏర్పాట్లపై సందర్భంగా ముస్లింలతో ఆయన చర్చించారు. ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి మాట్లాడుతూ ముస్లింల సంక్షేమానికి అటు రాష్ట్రంలో ఇటు తిరుపతిలో ఎంతో కృషిచేస్తున్నామని వివరించారు. ఎమ్మెల్యే, మేయర్, డిప్యూటీ మేయర్లు ముస్లింలకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, కార్పొరేటర్ కోటూరు ఆంజినేయులు, కో–ఆప్షన్ సభ్యుడు ఖాదర్‌బాషా, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఇమ్రాన్, తిరుపతి ఖాజీ సయ్యద్ షఫీ మహ్మద్ ఖాదరి, మాలిక్‌బాషా, ఇస్మాయిల్, చాంద్‌బాషా, గఫూర్, డీఈ రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

అబాకస్ విద్యార్థులకు బహుమతుల ప్రదానం



బహుమతులు సాధించిన విద్యార్థులతో నిర్వాహకులు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఆర్‌కే అబాకస్‌లో మూడు విభాగాల్లో శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులకు మంగళవారం నగదు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఆర్‌కే అబాకస్ డైరెక్టర్ ఆర్‌కే విమల మాట్లాడుతూ ప్రతి ఏటా చెన్నై విజ్‌కిడ్ అబాకస్ ఆధ్వర్యంలో శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు, సర్టిఫికెట్లు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం జూనియర్ విభాగం, మొదటి విభాగం, రెండో విభాగం శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు విశ్వం విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ విశ్వచందన్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఆర్‌కే అబాకస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ వేసవిలో ఎం.ఆర్.పల్లి సర్కిల్‌లోను, కె.టి.రోడ్డులోను ఉన్న తమ రెండు బ్రాంచ్‌ల్లో శిక్షణ ప్రారంభమవుతుందని తెలిపారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి

తిరుపతి ఎడ్యుకేషన్ : విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని, విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం తెలిపారు. తిరుపతిలోని శ్రీచైతన్య పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ఒలంపియాడ్ అభినందన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మరో అతిథి టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్ మాట్లాడుతూ గురువులు చెప్పే పాఠాలను శ్రద్ధగా అభ్యసించి జీవితంలో అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఐఎన్‌టీఎస్‌ఓ ఒలంపియాడ్‌లో ప్రతిభ చూపిన 15మంది విద్యార్థులకు ట్యాబ్‌లు, 153మందికి టాప్–5ర్యాంకులు, 1,642మందికి పతకాలను అందజేశారు. పాఠశాల ఏజీఎం ఎ.శ్రీనివాసులు, ప్రిన్సిపాళ్లు ఉమాదేవి, నీలిమ పాల్గొన్నారు.

రోజారాణికి డాక్టరేట్

తిరుపతి ఎడ్యుకేషన్: శ్రీపద్మావతి మహిళా వర్సిటీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ విభాగపు పరిశోధన విద్యార్థి బుద్ధా రోజారాణి డాక్టరేట్ డిగ్రీ పట్టా అందుకున్నారు. ఆ విభాగపు ప్రొఫెసర్ సంత్‌రాణి ఠాకూర్ మార్గదర్శకత్వంలో పరిశోధనా గ్రంథాన్ని సమర్పించారు.

అభివృద్ధి పనుల తనిఖీ

- నాణ్యతను పరిశీలించిన కమిషనర్ హరిత



రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: తిరుపతిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, తిరుపతిలో అమలవుతున్న పారిశుధ్య అమలుపై మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత తనిఖీ చేశారు. కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టాక క్షేత్రస్థాయిలో ఆమె మంగళవారం తనిఖీ చేశారు. కస్తూరిబాయ్ సంధు, అండర్ రైల్వే బ్రిడ్జ్, కర్నాలవీధి, బేరివీధి ప్రాంతాల్లో పర్యటించారు. అభివృద్ధి పనుల నాణ్యతను పరిశీలించారు. అలానే స్వచ్ఛత అమలుపై, పారిశుధ్యంపై ప్రజల నుంచి ఆరా తీశారు. ఎక్కడపడితే అక్కడ చెత్తను పారపోసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణను ఆదేశించారు. శ్రీనివాస సేతు మూడవదశ పనులను పరిశీలిస్తూ జూన్ నెలలో పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాల్సిందేనని ఆదేశించారు. ఎస్ఈ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు బాలసుబ్రహ్మణ్యం, షణ్ముగం, డీఈలు దేవిక, మహేష్, శానిటరి సూపర్ వైజర్ చెంచెయ్య పాలొన్నారు.

స్మార్ట్ సిటీ పనులు వేగవంతం

స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్‌లో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని స్మార్ట్ సిటీ ఎండీ డి. హరిత అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులపై అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. జనరల్ మేనేజర్ చంద్రమౌళి, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, ఈఈ చంద్రశేఖర్, డీఈ మోహన్, ఏఓ రాజశేఖర్, ఏఈకాం ప్రతినిధి బాలాజీ, స్మార్ట్ సిటీ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా చెవిరెడ్డి రంజాన్ కానుక పంపిణీ



కానుకను అందజేస్తున్న పద్మజారెడ్డి, కస్తూరి



కానుకను అందజేస్తున్న లోకనాథం, నరేష్‌రెడ్డి

పాకాల: మండలంలోని అన్ని ముస్లిం కుటుంబాలకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తన సొంత నిధులతో రంజాన్ కానుకను అందజేశారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ నేతల చేతులమీదుగా ఈ కానుకను పంపిణీ చేశారు. మండలంలో 3,167 కుటుంబాలకు ఈ కానుకను అందజేస్తున్నట్లు నేతలు పేర్కొన్నారు. రంజాన్ కానుకలో 5కేజీల బాస్మతి బియ్యం, 5కేజీల గోధుమపిండి, అర కేజి నెయ్యి, కేజి సేమియా, చక్కెర 2కేజీలు, వంట నూనె లీటరు పంపిణీ చేశారు. పాకాలలో పూరిపేట, పకీరుపేట, గాంధీనగర్, గుట్టకింద ఇండ్లలో ఈ కానుకలను అందజేశారు. జెడ్పీటీసీ నంగా పద్మాజారెడ్డి, ఎంపీపీ లోకనాథం, నంగా బాబురెడ్డి, నంగా నరేష్‌రెడ్డి, సర్పంచ్ కస్తూరి, కపిలేశ్వర్‌రెడ్డి, నంగా నితిన్‌రెడ్డి, మునీర్, రమేష్, మధు, సుధాకర్, సురేష్, మురళి, ఖాదర్‌వలీ, బేటా పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

తిరుపతి క్రైం: స్థానిక ప్రజలకు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఐదు రోజులుగా రాష్ట్ర విపత్తు, స్పందన, అగ్నిమాపక సేవా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వారోత్సవాల్లో మంగళవారం మహతి రోడ్డులో ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించారు. విపత్తు వాటిల్లితే వాటిని ఎలా అదుపుచేయాలనే దానిపై అవగాహన కల్పించారు. తిరుపతి సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం



తిరుచానూరు రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న కేంద్రమంత్రి దేవ్‌సిన్హ్ చౌహాన్

తిరుపతి అర్బన్: ఆధ్యాత్మిక కేంద్రం తిరుపతి నగరంలోని రైల్వేస్టేషన్ అభివృద్ధికి కేంద్రప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర సమాచార శాఖ సహాయ మంత్రి దేవ్‌సిన్హ్ చౌహాన్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన తిరుచానూరు రైల్వేస్టేషన్‌ను పరిశీలించారు. స్టేషన్‌ల పనులను వేగవంతంగా పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావడానికి కృషిచేస్తామని వెల్లడించారు. మీడియాతో మాట్లాడుతూ రైల్వేస్టేషన్‌తో పాటు స్మార్ట్‌సిటీలు, జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్రప్రభుత్వం కృషిచేస్తుందని పేర్కొన్నారు. బీజేపీ నేతలు భానుప్రకాష్‌రెడ్డి, సామంచి శ్రీనివాస్, దయాకర్‌రెడ్డి, వరప్రసాద్ పాల్గొన్నారు.

దావత్ ఇఫ్తార్ విందులో డిప్యూటీ మేయర్



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న అభినయరెడ్డి

తిరుపతి కల్చరల్: ప్రభుత్వ ఖాజీ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత సయ్యద్ షఫీ అహ్మద్ ఖాదరీ ఆధ్వర్యంలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం రాత్రి గిడ్డంగి వీధిలోని ఖాన్ ఖాఏ ఖాదిరీ పీఠంలో ఏర్పాటు చేసిన దావత్ ఇఫ్తార్ విందుకు డిప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి హాజరయ్యారు. ముందుగా పేద మహిళలకు అభినయరెడ్డి చేతుల మీదుగా చీరలు పంపిణీ చేశారు. అనంతరం ఇఫ్తార్ విందు స్వీకరించారు. కో ఆప్షన్ సభ్యుడు ఎస్.ఖాదర్‌బాషా, రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ ఫైనాన్స్ డైరెక్టర్ ఇమ్రాన్, ఇమామ్, కార్పొరేటర్ పొన్నాల చంద్ర, ముస్లిం జేఏసీ చైర్మన్ కేఎస్.ముత్తూజ, గఫూర్, ఆయూబ్‌ఖాన్, ముస్తఫా, అహ్మద్ బాషా, నేతలు ఎంవీఎస్. మణి, శ్రీనివాసులురెడ్డి, విజయరెడ్డి పాల్గొన్నారు.

1న విశాఖలో ఉద్యోగుల ఉప్పెన

తిరుపతి కల్చరల్: సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మే 1న విశాఖ తీరంలో నిర్వహించే ఉద్యోగుల ఉప్పెన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చీర్ల కిరణ్ తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు.



ఘనంగా సరస్వతీ పూజ



సరస్వతీ పూజలో విద్యార్థులు, తల్లిదండ్రులు

పాకాల: మణిపిరెడ్డిపల్లి ఎంపీపీ పాఠశాలలో సరస్వతీ పూజ, వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం హెచ్‌ఎం జయబాల ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలు క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. స్కూల్ కమిటీ చైర్మన్ ఈశ్వరీ, టీచర్ వనిత, హేమావతి, గీత, పాల్గొన్నారు.

జగనన్న లేకుంటే భవిష్యత్తే లేదు



పథకాలను వివరిస్తున్న తలారి రాజేంద్ర

తిరుపతి మంగళం: ముఖ్యమంత్రిగా వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో లేకుంటే మాకు భవిష్యత్తే లేదని సాయినగర్ ప్రజలు అంటున్నారని వైఎస్సార్‌సీపీ సేవాదళ్ రీజనల్ కో–ఆర్డినేటర్ తలారి రాజేంద్ర తెలిపారు. ఆయన తిరుపతి 48వ డివిజన్‌లో మంగళవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు.

తిరుచ్చిపై సుందరరాజస్వామి విహారం



తిరుచ్చిపై స్వామి అమ్మవార్లు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీసుందరరాజ స్వామివారు దేవేరులతో కలిసి మంగళవారం సాయంత్రం తిరుచ్చిపై భక్తులను కటాక్షించారు. స్వామివారి జన్మనక్షత్రమైన ఉత్తరాభాద్ర సందర్భంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీసుందరరాజ స్వామివారు తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఆలయ ఏఈఓ ప్రభాకర్ రెడ్డి, ఆలయ అధికారులు నాగేంద్ర, సుధాకర్‌నాయుడు పాల్గొన్నారు.

ప్రజాసంబంధాలు మెరుగుపడాలి



మాట్లాడుతున్న డీపీటీఓ చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్: ఆర్టీసీ ఉద్యోగులు ప్రజాసంబంధాలను మెరుగుపరుచుకోవడానికి అవసరమైన శిక్షణ ఇస్తున్నట్లు టీపీటీఓ చెంగల్‌రెడ్డి తెలిపారు. తిరుపతిలోని తన కార్యాలయంలో కండక్టర్లు, డ్రైవర్లకు ఈనెల 11 నుంచి జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ఆర్టీసీ డిపోల్లో సెంట్రల్ కంప్లైంట్ సెల్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఫిర్యాదులను వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామన్నారు. అనంతరం ప్రత్యేక నిపుణులు నారాయణస్వామి, జమీల్‌బాషా, మీరా, అజ్మల్ బాషా పలు సూచనలు చేశారు.

క్రికెట్ టోర్నమెంట్‌లో తిరుపతి పోస్టల్ అదుర్స్



విజేత జట్టును అభినందిస్తున్న పోస్టల్ సూపరింటెండెంట్ డాఫర్ సాధిక్

తిరుపతి అర్బన్: రాయలసీమ జిల్లాలకు సంబంధించి కర్నూలు పోస్టల్ రీజనల్ పరిధిలోని 8 పోస్టల్ ఉద్యోగుల జట్లు ఆదివారం అనంతపురంలోని పీటీసీ గ్రౌండ్‌లో క్రికెట్ పోటీల్లో తలపడ్డాయి. ఈ పోటీల్లో వంద మంది పోస్టల్ ఉద్యోగులు పాల్గొనగా ఫైనల్‌లో తిరుపతికి చెందిన తండర్ బోల్ట్స్ జట్టు, అనంతపురానికి చెందిన అలిగేటర్స్ జట్టు హోరాహోరీగా తలపడ్డాయి. ఈ క్రమంలో తిరుపతి తండర్ బోల్ట్స్ జట్టు 9 పరుగుల తేడాలో విజయం సాధించినట్లు కెప్టెన్ జి.శివప్రసాద్ పేర్కొన్నారు. తిరుపతి జట్టు సభ్యుడు ప్రవీణ్‌కుమార్ ఉత్తమ బ్యాట్స్‌మన్‌గా ఎంపికయ్యారు. ట్రోఫీ గెలిచిన జట్టును తిరుపతి తపాలాశాఖ సీనియర్ సూపరింటెండెంట్ జాఫర్ సాధిక్ మంగళవారం అభినందించారు. అసిస్టెంట్ సూపరింటెండెంట్ నాగరాజు, ఇన్‌స్పెక్టర్ మునిచంద్ర పాల్గొన్నారు.

సాయి సుధాలో ఎముకల సాంద్రత పరీక్షలు రేపు

తిరుపతి తుడా: స్థానిక రెడ్డి అండ్ రెడ్డి కాలనీలోని శ్రీ సాయిసుధా మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో 20వ తేదీ గురువారం ఎముకల సాంద్రత నిర్ధారణ పరీక్షలను ఉచితంగా నిర్వహించనున్నట్లు ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ సుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఈ పరీక్షలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని 40 సంవత్సరాలు పైబడిన వారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.